క్లుప్తంగా

'పత్రికా స్వేచ్ఛపై దాడి అమానుషం'

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వంలో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర స్థాయిలో భంగం కలుగుతోందని.. టీడీపీ నాయకులే స్వయంగా సాక్షి కార్యాలయాలపై దాడులు చేయడం ఇందుకు అద్దం పడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి కార్యాలయాల వద్ద విధ్వంసం సృష్టించి ఆస్తులు ధ్వంసం చేయడం.. కార్యాలయాలు తగలబెట్టడం.. ప్రజాస్వామ్యంలో దుర్మార్గమైన చర్యలని పేర్కొన్నారు. ఎచ్చెర్లలో ఉన్న సాక్షి కార్యాలయంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని సాక్షి కార్యాలయాలపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడడం దుర్మార్గమని తెలిపారు. పత్రికా స్వేచ్ఛను అణిచివేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి పత్రికలు, టీవీ చానళ్లు అనుసంధానంగా వ్యవహరిస్తాయన్నారు. వాస్తవాలను వెలికి తీసే పత్రికలు, టీవీ చానళ్లపై దాడులు సరికాదని అభిప్రాయపడ్డారు.

'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి'

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, లేదంటే ప్రభుత్వ విద్యా వ్యవస్థ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గొర్లె పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతోందని తెలిపారు. ఇదే పరిస్థితులు కొనసాగితే మరికొంత కాలానికి విద్యార్థుల నమోదు ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తల్లికి వందనం పథకం పథకం వర్తింపజేయడం సరికాదన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు

గుర్ల: మండల కేంద్రంలోని గుర్లలో జోరుగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. ఈ మేరకు కాలువల్లోని చెత్తాచెదారాలను గురువారం తొలగించి, ట్రాక్టర్ల ద్వారా తరలించారు. దోమల నివారణకు కాలువల్లో బ్లీచింగ్ పిచికారీ చేసినట్లు సర్పంచ్ ఈ.రమణమ్మ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంత్రి జగదీశ్వరి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

గుర్ల (గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్ల వలసలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల యువత అధ్యక్షుడు మన్నెపురి శ్రావణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 35 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినాయుడు, డాక్టర్ రాణీ, చైల్డ్ లింక్ వర్కర్స్ సంస్థ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల బంగారమ్మ తల్లికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాల పండగల నేపథ్యంలో ఉదయం నుంచే అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ

కొత్తవలస: మండలంలోని గిడిజాల రోడ్డులో కుమ్మరిబంజిరి వద్ద గల ముత్యాలమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల కిందట పండగ చాటింపు వేయగా.. గురువారం ఘటాలు ఊరేగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం: గర్భాం ఏపీ మోడల్‌స్కూల్‌లో 7, 8, 9 తరగతులలో మిగులు సీట్లతో పాటు భవిష్యత్‌లో ఈ మూడు తరగతులలో ఖాళీ అయ్యే సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్ అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

నేడు వరి విత్తనాలు పంపిణీ

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు శుక్రవారం వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఉదయం పది గంటలకు ఆర్‌ఎస్‌కే వద్దకు రావాలని కోరారు.

ప్రిన్సిపాల్‌గా జయశ్రీ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా టి.జయశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వియ్యంపేట గురుకుల పాఠశాల నుంచి ఈమె బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఉషారాణికి విశాఖ జిల్లా నక్కపల్లి గురుకుల పాఠశాల గ్రేడ్-2 ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు.

పీఎం సూర్యఘర్‌తో ప్రతి ఇంటికీ వెలుగులు..

- అన్ని వర్గాలకూ ఉపయోగకరం సోలార్ పవర్
- 60 శాతం సబ్సిడీతో పాటు బ్యాంక్ రుణం
- విద్యుత్ బిల్లు ఆదాతో పాటు అదనపు ఆదాయం



ఇంటిపై ఏర్పాటు చేసిన సౌరఫలకాలు



సోలార్ యూనిట్ ఏర్పాటు చేస్తున్న కార్మికుడు

శృంగవరపుకోట: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అన్నివర్గాల వారికీ ఉపయోగకరంగా మారింది. ఈ పథకంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వినియోగదారులు తమ ఇళ్లకు సొంత విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తారు. ఈ పథకాన్ని 2026 - 27 వరకు కేంద్రం అమలు చేయనుంది. సౌరశక్తి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ పథకాన్ని డిస్కమ్‌లు ప్రోత్సహిస్తున్నాయి. నెట్ మీటర్ల ఏర్పాటు, ఇన్‌స్టాలేషన్ తనిఖీ, వినియోగదారులకు కావాల్సిన సమాచారం అందివ్వడం, విద్యుత్ ఉత్పత్తి, కొనుగోలుకు సంబంధించి వివరాలు నమోదు వంటి సేవలు విద్యుత్ అధికారులు, డిస్కమ్ సిబ్బంది సకాలంలో అందిస్తారు.

మూడు కేటగిరీలుగా..

పీఎం సూర్యఘర్ యోజన పథకంలో మూడు కేటగిరీలుగా సౌర ఫలకాలు ఏర్పాటుకు ప్రభుత్వం వెసులు బాటు కల్పించింది. 2 కిలోవాట్ల సామర్థ్యం లోడ్‌లో 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ యూనిట్ విలువ రూ.1,44,000 కాగా, ప్రభుత్వం 60,000 రూపాయల సబ్సిడీ ఇస్తోంది. వినియోగదారుడు కేవలం 84000 రూపాయలు చెల్లించాలి. మూడు కిలోవాట్ల యూనిట్‌లో 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈయూనిట్ విలువ రూ. 2,06,000. 5 కిలోవాట్ల యూనిట్‌లో 600 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి కాగా దీని విలువ 3,24,500 రూపాయలు. కాగా ఈ రెండు యూనిట్లకు ప్రభుత్వం 78000 రూపాయల రాయితీ కల్పిస్తోంది. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో వినియోగదారులు ఎక్సైడ్, లూమినస్, ఆదానీ, టాటా పవర్, వారీ లాంటి కంపెనీలను ఎంపిక చేసుకోవచ్చు. వినియోగదారుడు చెల్లించాల్సిన వాటాకు సంబంధించి బ్యాంక్‌లు రుణాలు కూడా మంజూరు చేస్తాయి.

ఆదా చేసుకోవచ్చు.. అమ్ముకోవచ్చు..

ఈ పథకంలో వినియోగదారులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ఇంటి అవసరాలకు పోగా.. మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. ఎన్ని యూనిట్లు డిస్కమ్‌లకు విక్రయించారో అందుకు సంబంధించిన నగదును లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారు. దరఖాస్తుదారు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు 180 అడుగులు లేదా 300 అడుగుల ఇంటి పైకప్పు కలిగి ఉండాలి.

చాలా ఉపయోగకరం..



పీఎం సూర్యఘర్ యోజన పథకం చాలా బాగుంది. విద్యుత్ బిల్లు ఆదాతో పాటు ఆదనపు ఆదాయం వస్తుంది. నేను స్వయంగా మా ఇంటికి సూర్యఘర్ యోజన స్కీమ్‌లో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి దాని వల్ల లబ్ధి పొందాను. కరెంటు బిల్లు తగ్గింది. ఇప్పటికే ఎస్.కోట మండల పరిధిలో 85 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారు. మరింత మంది వినియోగించుకోవాలన్నదే మా లక్ష్యం.

– రవికుమార్, విద్యుత్ శాఖ ఏఈఈ, ఎస్.కోట సబ్ డివిజన్

వినియోగదారులు ఆనందంగా ఉన్నారు..



పీఎం సోలార్ సూర్యఘర్ యోజన స్కీమ్ చాలా బాగుంది. ఎస్.కోట పరిసర మండలాల్లో ఇప్పటికే 50కి పైగా ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేశాం. వాళ్లంతా చాలా హ్యాపీగా ఉన్నారు. యూనిట్ సక్రమంగా పనిచేస్తోంది. కరెంటు బిల్లు బాగా తగ్గిందని ఫీడ్‌బ్యాక్ ఇస్తున్నారు. వినియోగదారులు కోరుకున్న కంపెనీ యూనిట్ ఏర్పాటు చేస్తాం.

– పి.సురేష్, సర్వీస్ ప్రొవైడర్

ఒక్క హామీ నెరవేర్చలేదు..

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలోని అర్థన్నపాలెం సమీపంలో గల క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కనీసం పది శాతం హామీలు నెరవేర్చలేదన్నారున. హామీల గురించి నిలదీస్తే రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ఇబ్బందులు పాల్జేస్తున్నారని ఆరోపించారు. కూటమి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99.96 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి సుమారు లక్షా 20 వేల మంది ఉద్యోగులను నియమించారని చెప్పారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా ఉద్యోగాలు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి పాలనలో అరెస్టులు తప్ప అభివృద్ధి జాడే లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పాఠశాలలు, ఆస్పత్రుల్లో ఎన్నో భవనాలు నిర్మించామని... అందులో కొన్ని అసంపూర్తిగా ఉంటే వాటిని పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వలంటీర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రి శ్రీను, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లు అవినాష్, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస మండలాల అధ్యక్షులు వాకాడ సతీష్, తూర్పాటి అప్పలరాజు, ఒబ్బిన శ్రీనివాస్, ఐతంశెట్టి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

బొండపల్లి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, నాగేంద్ర, సంధ్యారాణి అన్నారు. మండలంలోని నెలివాడలో చేపడుతున్న ఉపాధి వేతనదారులను గురువారం కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల్లిమర్ల, బొండపల్లి, విజయనగరం రూరల్ పరిధిలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సహాయంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు, తదితరులు పాల్గొన్నారు.

కెమెరాల ఏర్పాటు అభినందనీయం

గజపతినగరం రూరల్: మండలంలోని తమ్మారాయుడిపేట ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక యువత ముందుకురావడం అభినందనీయమని గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల వాటిని అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ భాస్కర్, చంద్రరావు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదం బాధాకరం..

కొత్తవలస: అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన విమాన ప్రమాదం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలసలో గురువారం ఆయన మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్‌రూపానితో పాటు పలువురు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే ఈ ప్రమాదం జరగడం దారుణమన్నారు.

కూటమి పాలనలో అన్నీ మోసాలే..

- యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు 'బెల్లాన'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, తదితరులు

చీపురుపల్లి: కూటమి పాలనలో అన్నీ మోసాలేనని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాది కాలంగా నిరుద్యోగ యువత, విద్యార్థులకు చంద్రబాబు సర్కారు ఎంతో మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి గోవింద, కొమ్ము చిరంజీవి, గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, కొసిరెడ్డి రమణ, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, మహేష్, రాము, కరణపు ఆది, బలగ రమేష్, పనస వెంకట్, బలరాం, డీజే, తదిదతరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మెరకముడిదాం: మండల తహసీల్దార్‌గా ఎ.సులోచనారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రామభద్రపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అజూరఫీజాన్ రామభద్రపురం బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సులోచనారాణి మండల స్థితిగతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం

గజపతినగరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎండీఎం నిర్వాహకులకు గురువారం సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు, అరుణ, ఎంఈఓ విమలమ్మ, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

కొత్త విద్యావిధానానికి శ్రీకారం

శృంగవరపుకోట: కూటమి సర్కారు విద్యార్థుల శ్రేయస్సు కోసం కొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే లలితకుమారి అనానరు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్.చంద్రశేఖర్, జీఎస్ నాయుడు, రెడ్డి వెంకన్న, కె.మల్లేశ్వరరావు, జె.రామసత్యం, ఎన్.రమణాజీ, డోకుల అచ్చెంనాయుడు, సీహెచ్ కిరణ్, ఎ.చెల్లయ్య, వాకాడ బాలు, ఎస్.రామకృష్ణ, మోహన్, సురేష్, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రచారం..



కొట్టాంలో ప్రచారం చేస్తున్న హైస్కూల్ ఉపాధ్యాయ బృందం

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరాలని కోరుతూ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ప్రచారం చేపట్టారు. హెచ్‌ఎం పీవీ రామ్‌కుమార్, ఉపాధ్యాయులు వి.భాస్కరరావు, రహీం షేక్‌లాల్, డీవీ సూర్యనారాయణ, చిప్పాడ శ్రీనివాసరావు, పి.భాస్కరరావు, సలీం, విశ్వనాథరావు, స్వప్న, గోపి, తదితరులు గ్రామంలో ఇంటింటికీ ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకరాలు, బోధన గురించి వివరించారు. ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, బ్యాగ్, షూస్, సాక్సులు, తదితరల సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు.

లక్ష్యాలు నెరవేరేలా బోధన



ఎండీఎం నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎంఈఓ బాల భాస్కరరావు

వేపాడ: నూతన విద్యా సంవత్సరంలో లక్ష్యాలు నెరవేరే విధంగా బోధన అందించాలని ఎంఈఓ బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. వల్లంపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలను, తరగతి గదులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నిరసన



నిరసన తెలియజేస్తున్న వేతన కార్యదర్శులు, హెల్పర్లు

శృంగవరపుకోట: కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల వేతన కార్యదర్శులు, హెల్పర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శివరామరాజుపేట రోడ్డులో ఉన్న ఎస్.కోట యూనిట్ కార్యాలయంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యదర్శులకు రూ.5 లక్షలు, హెల్పర్లకు రూ.3 లక్షలు చొప్పున గ్యాట్యుటీ చెల్లించాలని, ఈఎస్‌ఐ అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కె.సన్యాసినాయుడు, వీవీ రమణతో సహ పలువురు వేతన కార్యదర్శులు, హెల్పర్లు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ కమిటీలు వేయాలి



తహసీల్దార్ ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న లోగిశ రామకృష్ణ, తదితరులు

గుర్ల: మండలానికి సంబంధించి జంతు సంక్షేమ కమిటీ వేయాలని రాష్ట్ర గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ కోరారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ ఆదిలక్ష్మిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. గోవుల పరిరక్షణకు మండల కమిటీలు వేసి గోవధ జరగకుండా చూడాలని వినతిలో పేర్కొన్నారు. గుజ్జింగివలస, తెట్టంగి, పాలాయవలస గ్రామ శివారు ప్రాంతాల్లో గోవధ జరుగుతోందని.. వాటిని ఆరికట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సత్యనారాయణ, ఝాన్సీ, తదితరులున్నారు.

మొక్కలు నాటండి..



మొక్క నాటుతున్న భాస్కరరావు, తదితరులు

గజపతినగరం: ప్రతి ఒక్కరూ తలో మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేటికోటి భాస్కరరావు అన్నారు. పురిటిపెంట బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో దొగ్గ దేవుడుబాబు, ఏడుకొండలు, ఈశ్వరరావు, మన్మథరావు,పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండల పరిధిలోని గొట్లాం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బొబ్బిలి సబ్ డివిజన్ ఈఈ అనంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని గొట్లాం, జియ్యన్నవలస, రెడ్డిపేట, డోలపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన జమ్ము, జమ్ముపేట, సదానందపురం, గొలగాం, తాటిపూడి, రాగోలు, శేషపుపేట, వల్లాపురం, దరమసింగి, గరిడ.. గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ నారంనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరు గ్రామాలకు..

దత్తిరాజేరు: ఆరికతోట సబ్‌స్టేషన్ పరిధిలో గల ఆరు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఆదిత్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో చౌదంతివలస, ఎస్టీ వలస, కె.కృష్ణాపురం, ఎం. కొత్తవలస, మరడాం, కె. కొత్తవలస, తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య

- సీడీపీఓ ఉమాభారతి



పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ ఉమాభారతి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తామని గంట్యాడ ప్రాజెక్టు సీడీపీఓ డి. ఉమాభారతి అన్నారు. మండలంలోని బుడతానపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన అందుతుందని చెప్పారు. మూడేళ్ల నిండిన వారందరినీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రథమ కో ఆర్డినేటర్ రమణ, పాల్గొన్నారు.

కానరాని సంక్షేమం..

- ఏడాదంతా కక్ష సాధింపు పాలనే
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో శాంతిభద్రతలకు విఘాతం
- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: వంచన పాలనకు ఏడాది ముగిసిందని టీడీపీ శ్రేణులు కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకోవడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని గజపతినగరం మాజీ శాసనసభ్యుడు బొత్స అప్పలనరసయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్ల వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరయ్యాయని చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం తప్ప సంక్షేమం ఎక్కడుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్ష సాధింపు చర్యలతో రాష్ట్రం రావణ కాష్టంగా మారిందన్నారు. ఇటు మహిళలకు అటు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కనీస రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పెన్షన్లు పెంచి మిగిలిన పథకాలకు తిలోదకాలిచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

ప్రజల్లో తీవ్ర అంసతృప్తి..

ప్రతి నెలా అప్పులు చేస్తూ ప్రభుత్వం నెట్టుకొస్తోందని, రాజధాని పేరుతో చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం మినహా మరే ఇతర వ్యాపారాలు సాగడం లేదని బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని చెప్పారు.

సూపర్ సిక్స్ అంతా మోసం

ఆరు పథకాలు మీ జీవితాలనే మారుస్తాయంటూ ఎన్నికల ముందు ప్రచారం చేసిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో గురువారం రూ.15 వేలు పడతాయని చెప్పినప్పటికీ ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా పడలేదన్నారు. నిరుద్యోగభృతి, గ్యాస్ సిలిండర్లు, రైతుకు వ్యవసాయ సాయం, ఇంటికో ఉద్యోగం అంటూ ఇచ్చిన ఏ హామీ కూడా అమలు కాలేదని ఎద్దేవా చేశారు.

కరెంటు బిల్లులతో లబోదిబో..

అధికారంలోకి వస్తే ఒక్కపైసా కూడా విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు మాట మార్చి నేడు సామాన్యుల నడ్డి విరిచారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు. ప్రతి నెలా రూ.500 వచ్చే వినియోగదారులకు నేడు వెయ్యి రూపాయలకు పైన బిల్లులు వస్తున్నాయన్నారు.

కమీషన్ కోసం రోడ్డు వెడల్పు..

నియోజకవర్గ కేంద్రంలోని మెంటాడ రోడ్డును కోట్ల రూపాయల నిధులతో వెడల్పు చేయనున్నట్లు మంత్రి శ్రీనివాస్ ప్రకటించారని, ఈ నేపథ్యంలో ఇటీవల స్థానిక వ్యాపారులతో సమావేశం కూడా నిర్వహించారని బొత్స అప్పలనరసయ్య అన్నారు. అయితే అభివృద్ధి కన్నా కంట్రాక్టర్ల నుంచి వచ్చే కమీషన్ కోసమే రోడ్డును వెడల్పు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే గజపతినగరం పట్టణం ఉడా పరిధిలోకి వచ్చినందున.. రోడ్డు అభివృద్ధి పనులు ఉడా వారికి అప్పగిస్తే స్థానిక వ్యాపారులు ఆర్థికంగా నష్టపోకుండా టీడీఎస్ వచ్చి ఉండేదని తెలిపారు. సదరు మంత్రికి పాలనా తీరు ఇప్పటికీ తెలియకపోవడం విడ్డూరంగా ఉందని బొత్స ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో భూ కబ్జాలు పెరిగిపోతున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన త్రినాథరావు, కంది తిరుపతిరావు, శీర రమణ, పైడపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.